ఎన్నికల విధులపై అవగాహన

- ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్రే కీలకం
- ఆదోని ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ


సెక్టోరల్ అధికారులకు అవగాహన కల్పిస్తున్న సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ

ఆదోనిరూరల్: ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకమైనదని ఆదోని ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ శివనారాయణ శర్మ పేర్కొన్నారు. శుక్రవారం ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఎన్నికల విధులపై సెక్టోరల్ అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదోని నియోజకవర్గంలో 256 పోలింగ్ కేంద్రాలకు గానూ 25 మంది ఆఫీసర్లు, ఇద్దరు రిజర్వ్ కలిపి 27 మంది సెక్టోరల్ ఆఫీసర్‌లను నియమించడం జరిగిందన్నారు. సెక్టోరల్ అధికారులు ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. శిక్షణ సామగ్రి, చేయాల్సినవి, చేయకూడనివి, చెక్‌లిస్ట్, హ్యాండ్‌బుక్‌ల గురించి వివరించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించడంలో సెక్టోరల్ అధికారుల పాత్ర ముఖ్యమన్నారు. సెక్టోరల్ అధికారులు తమ పరిధిలోని ప్రతి పోలింగ్ స్టేషన్‌ను సందర్శించి మౌలిక వసతులు ఉండేలా చూసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు, పోలింగ్ సిబ్బందికి వసతుల విషయమై లోటుపాట్లు ఉంటే వెంటనే తమ దృష్టికి తెచ్చి, వసతుల కల్పన పూర్తి చేయాలన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు. ఆదోని తహసీల్దార్ హసీనాసుల్తానా, డీఎల్‌పీఓ కార్యాలయ పరిపాలనాధికారి వీరభద్రప్ప, ఎలక్షన్ డీటీ ఎజాజ్‌అహ్మద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన ఉరుకుంద


ప్రత్యేక అలంకరణలో ఈరన్నస్వామి మూలవిరాట్


దర్శనానికి క్యూలో భక్తులు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయం అమావాస్య సందర్భంగా వేలాది మంది భక్తులు తరలిరాగా.. శుక్రవారం సందడిగా మారింది. అమావాస్య కావడంతో భక్తులు తమ ఇంటి ఇలవేల్పును దర్శించుకోవాడానికి వేలాదిగా తరలివచ్చారు. గురువారం సాయంత్రం నుంచే క్షేత్ర పరిసరాలు భక్తులతో నిండిపోయాయి. ఇక తెల్లవారుజాము నుంచే మరింత మంది వివిధ ప్రాంతాల నుంచి చేరుకోవడంతో ఆలయ పరిసరాలు భక్తులతో పాటెత్తాయి. దీంతో దర్శనం కోసం గంటకు పైగా సమయం పట్టింది. తెల్లవారు జామున 4 గంటలకు అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ప్రత్యేక దర్శనం క్యూలైన్‌లో కూడా భక్తులు గంటకు పైగా దర్శనానికి నిరీక్షించాల్సి వచ్చింది. పలువురు భక్తులు క్షేత్ర ఆవరణలోనే పిండివంటలు వండి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆదోని, ఎమ్మిగనూరు, కర్ణాటకలోని రాయచూరు, శిరుగుప్ప, డిపోలవారు ప్రత్యేక బస్సులు నడిపారు. కౌతాళం పోలీసులు బందబస్తు ఏర్పాటు చేశారు.

బుడుములదొడ్డి ఆంజనేయస్వామి ఆలయంలో..

ఉరుకుందకు ఐదు కిలోమీటర్ల దూరంలో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి ఆలయం శుక్రవారం భక్తులతో సందడిగా మారింది. ఉరుకుంద ఈరన్నస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు స్వామి దర్శనానికి వెళ్లడంతో క్షేత్రం కిటకిటలాడింది. అలాగే.. తుంగభద్ర నది ఒడ్డున మేళిగనూరు గ్రామంలో వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరగడంతో భక్తులు తరలివచ్చారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతం కావడంతో కర్ణాటక భక్తులు అధికంగా వచ్చి స్వామిని దర్శించుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదోనిఅర్బన్: పట్టణంలో విద్యుత్ ఫీడర్లనలో మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ పురుషోత్తం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణమంతా విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో కల్లుమఠం పీఠాధిపతి గురుసిద్ధ లింగస్వామి

ఆదోని సెంట్రల్: కర్నూలు, అనంతపురం జిల్లాలోని ప్రభుత్వ కన్నడ పాఠశాలలో 10వ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించారు. శుక్రవారం పట్టణంలోని మహేశ్వర కళ్యాణ మండపంలో కన్నడ భాషాభివృద్ధి సాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కల్లుమఠం పీఠాధిపతి గురుసిద్ధ లింగస్వామి పాల్గొని మాట్లాడుతూ.. కన్నడ భాషాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కన్నడ పాఠశాలల్లో ఉపాధ్యాయుల భర్తీ చేయకపోవడంతో పాఠశాలలు మూతపడే అవకాశం ఉందన్నారు. కన్నడ పాఠ్య పుస్తకాలను కూడా సకాలంలో ముద్రించి పంపిణీ చేయాలన్నారు. కన్నడ ప్రజావాణి సంపాదకులు రవీంద్ర భట్టు మాట్లాడుతూ కన్నడ మీడియం చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. డివిజన్లో కన్నడిగులు ఎక్కువగా ఉన్నారని వారి సౌకర్యార్థం కన్నడ మీడియం కొనసాగించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించారు. పురపాలక చైర్‌పర్సన్ శాంత, కన్నడ భాషాభివృద్ధి డివిజన్ అధ్యక్షుడు శరణప్ప, దేశాయి చంద్రన్న కృష్ణమూర్తి గౌడ్, రామలింగప్ప, డాక్టర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న వాసవీమాత

ఆదోనిఅర్బన్: స్థానిక నగరేశ్వర స్వామి గుడిలో శుక్రవారం వాసవీమాత అఖండ నామం సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వాసవీ మాల ధారులు, భక్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాలధారులు భజనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ఆదోనిరూరల్: ఆశావర్కర్ల అక్రమ అరెస్టుకు నిరసనగా శుక్రవారం ఆదోని పట్టణంలోని శ్రీనివాసభవన్ సర్కిల్‌లో స్థానిక ఆశావర్కర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి సీఐటీయూ పట్టణ కార్యదర్శి గోపాల్, జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న, మండల కార్యదర్శి వీరారెడ్డి మాట్లాడుతూ ఆశావర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈనెల 8వ తేదీన ఆశావర్కర్లు తలపెట్టిన ఛలో విజయవాడ కార్యక్రమాన్ని అడ్డుకుని గృహనిర్బంధం చేయడం తగదన్నారు. ఇకనైనా వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

రేపు సంగీత విభావరి

ఆదోనిఅర్బన్: మధురగాయకుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత ఘంటసాల 50వ వర్ధంతి సందర్భంగా ఆదోని పట్టణంలో స్వర సంగమం సంగీత విభావరి కార్యక్రమం ఆదివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు మల్లికార్జున శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు స్థానిక మంగళ ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో శృతి లయ సంగీత కళా సేవా సమితి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమానికి ప్రముఖులు, కళాకారులు, సంగీత అభిమానులు పాల్గొంటారని చెప్పారు. గాయకులు ఘంటసాల పాటలను ఆలపిస్తారని చెప్పారు.

కులగణన సర్వే త్వరగా పూర్తి చేయండి

కోసిగి: కులగణన సర్వే వందశాతం త్వరగా పూర్తి చేయాలని ఈఓపీఆర్డీ ఆరూన్ రషీద్, ఏఓ మాధవరెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని గ్రామ సచివాలయ ఉద్యోగులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సచివాలయాల వారీగా సర్వే నివేదికలను పరిశీలించారు. విధుల పట్ల కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వలస వెళ్లిన కుటుంబాలను ఫోన్ నెంబర్ ఆధారంగా ఓటీపీ ద్వారా పూర్తి చేసేలా చూడాలని ఆదేశించారు. పంచాయతీ ఈఓ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శిలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

కనీస వేతనమివ్వాలి

కోసిగి: ఆశావర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు, మండల ఉపాధ్యక్షుడు వీరేష్‌లు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లతో కలిసి హాస్పిటల్ నుంచి పురవీధుల్లో ర్యాలి చేపట్టి వైఎస్సార్ సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, అర్హత కలిగిన ఆశా వర్కర్లకు ఏఎన్‌ఎంలుగా పదోన్నత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. యూనియన్ నాయకురాలు సుజాత, పార్వతి, చంద్రమ్మ, సంధ్య, ఇందిరమ్మ, శ్రీదేవి, చిట్టెమ్మ, పద్మ, రాధమ్మ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు, పైపులైన్ పనులు ప్రారంభం


పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శేషిరెడ్డి

ఆదోనిరూరల్: మేజర్ గ్రామ పంచాయతీ మండిగిరిలోని తిరుమలనగర్ కొట్టాలలో సీసీ రోడ్డు, తాగునీటి పైపులైన్ ఏర్పాటు పనులు చేపట్టారు. ఇటీవల 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే తనయుడు జయమనోజ్‌రెడ్డి పర్యటించి కాలనీవాసుల సమస్యలు తెలుసుకున్నారు. సమస్యలను ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రూ.10 లక్షలు పంచాయతీ నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ మేరకు శుక్రవారం పనులు ప్రారంభంకాగా మాజీ సర్పంచ్, వైఎస్సార్సీపీ జిల్లా కార్యదర్శి శేషిరెడ్డి పరిశీలించారు. కాలనీల్లో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ఇంజినీర్ అజయ్ పాల్గొన్నారు.

16న గ్రామీణ బంద్‌కు సీపీఎం మద్దతు


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.వెంకటేశులు

ఆదోనిరూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా సంయుక్త కిసాన్‌మోర్చా, కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఫిబ్రవరి 16న జరిగే గ్రామీణ బంద్‌కు సీపీఎం సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.వెంకటేశులు, సీపీఎం మండల కార్యదర్శి కె.లింగన్న తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ మండల కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఈనెల 1వ తేదీన ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో సామాన్య ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందని, బీజేపీ పేదలకు చేస్తున్న ద్రోహానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. వ్యవసాయ ఉత్పత్తుల గిట్టుబాటు ధరకు చట్టబద్ధత కల్పించాలని, రైతు రుణాలు మాఫీ చేయాలని, ఎరువులు, పురుగు మందుల ధరలు తగ్గించాలని, వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు 200 రోజులు కల్పించాలని, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలన్నారు. ఈనెల 16వ తేదీన చేపట్టే దేశవ్యాప్త గ్రామీణ బంద్‌లో రైతులు, కూలీలు, సామాన్య ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నులిపురుగుల నివారణ చర్యలు


పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న దృశ్యం

కోసిగి: పిల్లల ఆరోగ్యాన్ని నులిపురుగులు దెబ్బతీస్తాయని, వాటి నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నజీర్ అహ్మద్ తెలిపారు. శుక్రవారం స్థానిక అంగన్ వాడీ, ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రైవేట్ స్కూళ్లల్లో చిన్నారులకు అల్‌బెండజోల్ మాత్రలు వేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 19 ఏళ్ల లోపు 22,953 మందికి గానూ 22,264 మందికి మాత్రలు అందజేశామని చెప్పారు. మిగిలిన వారికి ఈనెల 16వ తేదీన వేస్తామని చెప్పారు. హెల్త్ సూపర్‌వైజర్లు యల్లప్ప, శ్రీనివాసులు, రాముడు, ఏఎన్‌ఎం సుజాత పాల్గొన్నారు.

కౌతాళం: నులిపురుగు నివారణతో ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తా, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ తెలిపారు. స్థానిక కళాశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండెజోల్ మాత్రలను శుక్రవారం పంపిణీ చేశారు.పొదలకుంట గ్రామంలో ఎంపీడీఓ విద్యార్థులకు నులిపురుగు వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. పరిపాలన అధికారి సత్యన్న, అధ్యాపకులు శ్రీనివాసరెడ్డి, ప్రకాశ్‌రాజ్, రవికుమార్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలందించండి

హాలహర్వి: వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలందించాలని ఆదోని డిప్యూటీ డీఎంహెచ్ఓ సత్యవతి సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆమె హాలహర్వి పీహెచ్‌సీ, జెడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య సలహాలు తెలియజేశారు. వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు, విద్యార్థులకు అందుబాటులో ఉంటారని, మెరుగైన వైద్యసేవలు అందిస్తారన్నారు. డాక్టర్లు మన్సూర్‌వలీ, హెచ్ఎం వెంకటరమణ, సూపర్‌వైజర్లు అబ్రహం, ఆదినారాయణ, సుగుణ, సీహెచ్‌ఓలు, సిబ్బంది వెంట ఉన్నారు.

పల్లెల్లో ప్రశాంతంగా జీవించాలి


పల్లెపాడులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ


కోసిగి: గ్రామాల్లో ప్రజలు కలసిమెలసి ప్రశాంతంగా జీవించాలని ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య సూచించారు. శుక్రవారం రాత్రి మండలంలోని పల్లెపాడు గ్రామంలో అసెంబ్లీ ఎన్నికల దృష్టిలో ఉంచుకుని సీఐ ప్రసాద్, ఎస్ఐ సతీష్ కుమార్‌తో కలిసి గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో పాత కక్షలను మనుస్సులో పెట్టుకుని పట్టింపులకు పోయి ఘర్షణలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని చెప్పారు. పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దాలని సూచించారు. వివిధ పార్టీల గ్రామ నాయకులు పాల్గొన్నారు.

పీవీకి భారతరత్న తెలుగుజాతికి గర్వకారణం


మధుసూదనశర్మ

ఆదోనిఅర్బన్: మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతదేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రకటించడం సంతోషంగా ఉందని ఏపీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెల్లాల మధుసూదన శర్మ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ.. భారతదేశ అభివృద్ధిలో పీవీ నరసింహారావు పాత్ర కీలకమైనదన్నారు. భారతదేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ప్రధానమంత్రి పదవిని చేపట్టి ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చి ప్రపంచమంతా భారతదేశం వైపు చూసేలా చేశారన్నారు. వివిధ దేశాలు ఆర్థిక పెట్టుబడులు పెట్టేందుకు అనుకూలమైన దేశంగా భారతదేశానికి గుర్తింపు తీసుకొచ్చిన మహోన్నతమైన వ్యక్తి పీవీ అని చెప్పారు. అలాంటి వ్యక్తికి నేడు భారతరత్న ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి, ప్రధానమంత్రి నరేంద్రమోదీకి యావత్ బ్రాహ్మణజాతి తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా పురందరదాసుల ఆరాధన


ప్రత్యేక అలంకరణలో సత్యనారాయణస్వామి

ఆదోనిఅర్బన్: పట్టణంలోని ఎస్‌కేడీ కాలనీలో వెలసిన సత్యనారాయణ స్వామి ఆలయంలో పురందర దాసుల ఆరాధన సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి గిరిరాజా ఆచారి ఆధ్వర్యంలో శ్రీలక్ష్మి నరసింహస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పురందరదాసుల వారికి పూజలు నిర్వహించి భజన మండలి వారు భక్తి గేయాలను ఆలపించారు. మధ్యాహ్నం ఆలయ నిర్వాహకులు బ్రాహ్మణ భక్తులకు అన్నదానం చేశారు. బ్రాహ్మణ భక్తులు, పండితులు పాల్గొన్నారు.

వేగంగా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్


కోసిగి సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేస్తున్న సచివాలయ సిబ్బంది

కోసిగి: జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ వేగంగా సాగుతోంది. శుక్రవారం మండలంలోని 19 గ్రామ సచివాలయాల్లో పంచాయతీకార్యదర్శులు,వీఆర్వోలు ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేయించారు. ఉద్యోగులు మాట్లాడుతూ మండలంలోని 26 గ్రామాలకు గానూ జగనన్న కాలనీల్లో 2,027 ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. పట్టాలు పొందిన వారికి స్థలంపై శాశ్వత హక్కు లభించేలా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు.ఇప్పటి వరకు సచివాలయాల కార్యాలయాల్లో 75శాతం స్థలాలను రిజిస్ట్రేషన్ చేశామని చెప్పారు. వెల్ఫేర్‌అసిస్టెంట్ గ్రీష్మ,వీఆర్వో లింగన్న పాల్గొన్నారు.

క్లుప్తంగా

బసవేశ్వర స్వామికి విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో బసవేశ్వర స్వామి

కోసిగి: స్థానిక బసవన్న కొండపై వెలసిన శ్రీ బసవేశ్వర స్వామికి శుక్రవారం అమావాస్యను పురస్కరించుకుని ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ అర్చకులు ఉమేష్ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి వేకువ జామున నుంచి జలాభిషేకం, పంచామృతాభిషేకం, వెండికవచ అలంకరణ, ఆకు పూజలు గావించి మహా మంగళ హారతులు పట్టారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని నారికేలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శివస్వాములు ప్రత్యేక భజనలు చేశారు. ఆలయ కమిటీ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

దర్గాలో అమావాస్య పూజలు


ఫాతెహాలు చేస్తున్న భక్తులు

కౌతాళం: స్థానిక జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో శుక్రవారం అమావాస్య సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చి ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. కొందరు భక్తులు పిండి వంటలు వండి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు తరలిరావడంతో దర్గా పరిసరాలు సందడిగా మారాయి. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీ స్వామి సమాధికి గంధం పూసి ఫాతెహాలు చేపట్టారు.

అట్రాసిటి కేసుపై విచారణ


సాలహళ్లిలో విచారణ చేస్తున్న డీఎస్పీ సీతారామయ్య

మంత్రాలయం: మండలంలోని సాలహళ్లి గ్రామానికి చెందిన హరిజన మహాలక్ష్మి అనే బాధితురాలు భూ తగాదాలో ఇద్దరి రైతులపై ఎస్సీ కేసు నమోదు చేశారు. శుక్రవారం ఎమ్మిగనూరు డీఎస్పీ కేసు విచారణలో భాగంలో గ్రామానికి చేరుకుని క్షేత్ర స్థాయిలో విచారించారు. గ్రామ పరిధిలో సర్వే నంబర్ 19/బి1ఏలో ఉన్న 2.89 ఎకరాల భూమి విషయంలో ఆమె ఫిర్యాదు చేశారు.బాధితురాలితో పాటు సాక్షులను విచారించారు. మాధవరం ఎస్ఐ కిరణ్ బాబు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి


వల్లూరు సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కౌతాళం: ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తా సూచించారు. శుక్రవారం మండలంలోని వల్లూరు, పొదలకుంట గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలను ఎప్పటికప్పుడు పరిశీలించి పురోగతి సాధించాల్సిన అసవరం ఉందని ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించాలని చెప్పారు. కూలీలు వలస పోకుండా అందరికీ పని కల్పించాలన్నారు. పరిపాలన అధికారి సత్యన్న, కార్యదర్శులు ఉన్నారు.

శివస్వాములకు అన్నదానం


శివస్వాములకు అన్నదానం చేసిన శ్రీకాంత్‌రెడ్డి

ఆదోనిఅర్బన్: పట్టణశివారులోని కోటనగర్‌లో వెలిసిన కోట చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా శివదీక్షాపరులకు శుక్రవారం పారిశ్రామికవేత్త శ్రీకాంత్‌రెడ్డి అన్నదానం చేశారు. ముందుగా కోట చంద్రమౌళేశ్వరస్వామికి పంచామృతాభిషేకం, బిల్వార్చన, నైవేద్యం, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం దీక్షాపరులైన శివస్వాములకు ఆయన చేతులమీదుగా అన్నదానం చేపట్టారు. అనంతరం ఆలయ అభివృద్ధికి రూ.2 లక్షలు సాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు రవి, తిమ్మప్ప, హనుమంతు, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.